క్లుప్తంగా

అసిస్ట్ రంగారావుకు గౌరవ డాక్టరేట్



చిలకలూరిపేట: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అసిస్ట్ ఇండియా డైరెక్టర్ జాస్తి రంగారావుకు సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. అసిస్ట్ సంస్థ ద్వారా గత 50 సంవత్సరాలుగా అందించిన సేవలకు గాను తమిళనాడులోని తిరుచురాపల్లిలో ఆ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రాజ్ కుమార్ చేతుల మీదుగా ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జె.కృష్ణ హరీష్ తెలిపారు. ఏపీ, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో అందించిన సేవలకు ఈ పురస్కారం లభించటం పట్ల అసిస్ట్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్లు టి.రామారావు, ఎంవీ రామారావు, పి.రవిబాబు, అసిస్ట్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

దాతల చేయూతను సద్వినియోగం చేసుకోవాలి

కనపర్రు స్కూలుకు హెచ్‌బీఎల్ చేయూత



నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి హెచ్‌బీఎల్ కంపెనీ అందిస్తున్న చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చక్కగా చదివి ఉన్నతంగా రాణించాలని హెచ్ఎం రాజ్యలక్ష్మీ చెప్పారు. కనపర్రు బీపీఆర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఎండీ ఏజే ప్రసాద్, మేనేజర్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ రేవతి శనివారం నోటుపుస్తకాలు, పెన్నులు, చార్టులు, కుర్చీలు, ఇనుప బీరువాను పాఠశాలకు అందించారు. కార్పోరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరానికి సరిపడా విద్యా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజ్యలక్ష్మి, మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యం మానవతా దృక్పథంతో ఈ పరిసరాల్లోని ప్రాథమిక పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నదన్నారు. వారి సేవలు విలువైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకె వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలి



నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూకే ఇంజనీరింగ్ కళాశాల వద్ద బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ వినుకొండ–నరసరావుపేట రోడ్డులోని కాకాని జేఎన్‌టీయూఎన్ కళాశాల వద్ద బస్‌స్టాప్ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాల నుంచి రోడ్డు మీదకు వచ్చిన విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తుందన్నారు. ఎండైన, వానైన రోడ్డు మీదనే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు సాయి ప్రణీత, ఆదర్శ, ప్రణీత్, ప్రియా, కీర్తి లిఖిత తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో 500 ఎకరాల్లో వరి పంటకు దెబ్బ

ఏవో ఎ.అంకారావు



బొల్లాపల్లి: అకాలవర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని ప్రాథమిక అంచనాల్లో పరిశీలించామని మండల వ్యవసాయాధికారి ఎ.అంకారావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వరిపంటను పరిశీలించామన్నారు. వడ్డెం గుంట, వెల్లటూరు, నాయుడుపాలెం, పేరూరుపాడు, కనుమలచెరువు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 2 వేల ఎకరాలకు పైగా రైతులు వరి పంటను సాగు చేశారని, ప్రాథమిక పరిశీలన చేయగా సుమారు 500 ఎకరాలు పంట నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు తెలిపారు.

అడుగు వేయలేం.. తీయలేం

- ఎలా.. ఈ రహదారిపై ప్రయాణం చేసేది?
- అధ్వానంగా మారిన డొంక రోడ్డు
- కచ్చా డ్రెయిన్ బురద పోయడంతో రాకపోకలకు అసౌకర్యం
- పాపం.. జారిపడుతున్న వాహనచోదకులు



కాలు తీసి పెట్టలేని స్థితిలో రహదారంతా పేరుకుపోయిన బురద



ఏఎంజీ పెట్రోల్‌బంకు వద్ద నుంచి గణపవరం వెళ్లే రహదారి ఇదే



శివప్రియనగర్ వద్ద మురుగుకాలువపై ఆక్రమణలు

నాదెండ్ల: చిలకలూరిపేట ఏఎంజీ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద నుంచి శివప్రియనగర్ మీదుగా గణపవరం వెళ్లే తారు రోడ్డు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా మారింది. చిలకలూరిపేట పట్టణం నుంచి వెలువడే మురుగునీరు కచ్చా కాలువ ద్వారా శివప్రియనగర్ మీదుగా కుప్పగంజివాగులో కలుస్తుంది. ఇటీవల కాల్వల్లో పూడికతీత పనుల్లో భాగంగా కచ్చా డ్రెయినులో బురద, మట్టిని తవ్వి రోడ్డుపై వేశారు. దీంతో రోడ్డంతా బురదమయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలువురు వాహనాలు జారిపడటంతో వాహన చోదకులు గాయాలపాలౌతున్నారు. నాదెండ్ల మండల పరిధిలోని సుమారు పది గ్రామాల ప్రజలు ఈ డొంక రోడ్డు మీదుగానే చిలకలూరిపేట పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. తారురోడ్డుపై మురుగుకాలువ మట్టి పోయడంతో బురదమయమైందంటూ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఆక్రమణలు తొలగించకుండానే కాలువల్లో పూడికతీత

శివప్రియ నగర్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేసుకుంటున్నారు. వ్యాపార దుకాణాల ముందు కాలువల్లో సిమెంటు పైపులు వేసి పూడ్చేశారు. అయితే సిమెంటు పైపుల సామర్థ్యం చాలక మురుగునీరు వెనక్కు తంతూ రోడ్డుపైనే ప్రవహిస్తున్నది. పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డుపై మురుగుపారుతూ అధ్వానంగా తయారైంది. దీంతో ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించే ప్రజలు మురుగు కారణంగా ముక్కు మూసుకుని ప్రయాణించే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించకుండానే పూడికతీత పనులు చేశారు. కాలువ ఆక్రమణలు తొలగించకుండా పూడిక తీసినా ప్రయోజనం ఏందంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాలువ ఆరంభం నుంచి ఆక్రమణలు పూర్తిగా తొలగించి కాలువలు పూడికతీసి శుభ్రం చేస్తేనే పట్టణం నుంచి వెలువడే మురుగు కుప్పగంజివాగులో కలుస్తుంది. ఇటీవల ఆర్ అండ్ బీ అధికారులు పెట్రోల్ బంకు వద్ద నుంచి గణపవరం, నాదెండ్ల మీదుగా జంగాలపల్లె వరకూ 13 కిలోమీటర్ల వ్యవధిలో రూ.40 లక్షల వ్యయంతో ప్యాచ్‌వర్క్‌లు చేశారు. అయితే పూడికతీత బురద వేయటంతో రోడ్డు అధ్వానంగా మారిందని ప్రజలు మండి పడుతున్నారు.

హైవే వెంబడి కాలువలోకి మురుగునీరు మళ్లించాలి

జాతీయ రహదారి వెంబడి ఉన్న డ్రెయినేజీని గతంలో పెట్రోల్ బంకు పక్కనే ఉన్న ఓ వ్యాపారదుకాణ నిర్వాహకుడు ఆక్రమించి మురుగు ప్రవాహాన్ని గణపవరం డొంకరోడ్డులోకి మళ్లించాడు. కచ్చా డ్రెయిన్ కావటంతో మురుగునీరు ముందుకుపారక వెనక్కుతన్ని పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు ఆక్రమణలు తొలగించి హైవేకు ఇరువైపులా ఉన్న కాలువల ద్వారా మురుగునీటి పారుదల జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డును పరిశీలిస్తా



జాతీయ రహదారికి పడమర వైపునున్న మురుగుకాల్వ నీరు కుప్పగంజి వాగులో కలిసేందుకు ప్రొక్లెయినర్‌తో కాలువ పూడిక తీయించాం. వర్షం కురవటంతో పూడిక మట్టి రోడ్డుపై చేరి బురదమయమైంది. రోడ్డును పరిశీలించి శుభ్రం చేయిస్తా. మురుగునీరు పారుదలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటాం.

–శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్, చిలకలూరిపేట

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంతో పాటు ప్రత్యేక బడ్జెట్ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

30న చినకంచర్ల మేడిచెరువు వేలంపాట

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఉన్నటువంటి మేడిచెరువును బహిరంగ వేలంపాట ఈనెల 30న ఉదయం 10 గంటలకు ఎంపీపీ స్కూలు ప్రాంగణంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలంపాటలో పాల్గొనే వారు తప్పనిసరిగా ధరావత్తు రూ. 50 వేలు చెల్లించాలన్నారు. పాట పాడిన వారు 75 శాతం నగదును అధికారుల సమక్షంలో తక్షణమే చెల్లించాలన్నారు. అధికారులదే తుది నిర్ణయమన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

చిలకలూరిపేట: పట్టణ పరిధిలో పనిచేసే వివిధ చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ అందించి, ధృవీకరణ పత్రాలు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని కార్పెంటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ,గీజర్, టీవీ మెకానిక్‌లు,బ్యూటీషియన్లుతో పాటు అన్ని రకాల సేవలు అందించే వారికి శిక్షణ అందించి సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు. దీంతో పాటు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫాం ద్వారా జీవనోపాధి కల్పించబడుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో రేషన్‌కార్డు, ఆధార్,బ్యాంకు పాస్‌పుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్టు సైజు ఫోటోతో దరఖాస్తు చేయాలన్నారు.

సొసైటీ సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

- ముమ్మరంగా కార్యక్రమం
- సొసైటీలో సభ్యులకు తప్పనిసరి



సచివాలయాల్లో సొసైటీ సభ్యులకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

రొంపిచర్ల: జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆ శాఖ అధికారులు కోరుతున్నారు. సభ్యుల షేర్ ధనం, డిపాజిట్లు, లోన్ అకౌంట్‌లను ప్రభుత్వం డిజిటలైజేషన్ చేస్తుంది. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 పీఏసీఎస్‌లో ఉన్న ఖాతా దారులందరికీ అకౌంటులను ఆధార్ కార్డులతో లింక్ చేసి, ఈకేవైసీ చేయాలని ప్రభుత్వానికి నబార్డ్ సూచించింది. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదైన 79,624 మంది సభ్యులకు ఆధార్, సేవింగ్ అకౌంట్‌లతో లింక్ చేయటంతో పాటు ఈకేవైసీ చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కంప్యూటరీకరణ కార్యక్రమం వేగవంతంగా కొనసాగించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేస్తున్న సిబ్బందితో పాటు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని కూడా బాధ్యతలు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 అర్బన్, రూరల్ ఏరియాల్లో 79,624 మంది ఉండగా నరసరావుపేట మండలంలోని సంఘాలలో 5030 మంది సభ్యులు ఉండగా, ఈపూరులో 2157, నాదెండ్లలో 3154, చిలకలూరిపేట రూరల్‌లో 2408, రొంపిచర్లలో 4092, మాచర్ల అర్బన్‌లో 623, కారంపూడి 1800, నరసరావుపేట అర్బన్ 1302, చిలకలూరిపేట అర్బన్ 1022, శావల్యాపురం 3813. నూజెండ్ల 2276, గురజాల 3195, బొల్లాపల్లి 1628, సత్తెనపల్లి అర్బన్ 462, ముప్పాళ్ల 2096, యడ్లపాడు 4082, మాచవరం 1419, క్రోసూరు 1741, వినుకొండ 1693, పెదకూరపాడు 2469, దాచేపల్లి 3190, పిడుగురాళ్ల 3265, నకరికల్లు 3692, వెల్దుర్తి 1846, రెంటచింతల 2747, సత్తెనపల్లి రూరల్ 4297, దుర్గి 2169, అచ్చంపేట 2448, వినుకొండ అర్బన్ 938, బెల్లంకొండ 899, మాచర్ల 1258, పిడుగురాళ్ల అర్బన్ 832, అమరావతి 4212, రాజుపాలెం మండలంలో 1069 మంది సభ్యులు ఉన్నారు. వీరందరి పేర్లు వారి వారి ఆధార్ కార్డులతో నమోదు చేశారు. గత వారం రోజులుగా గ్రామ సచివాలయాలు, సొసైటీల సభ్యులతో కళకళలాడుతున్నాయి. ఈకేవైసీ కార్యక్రమం మరింత వేగవంతంగా సాగేందుకు సచివాలయాల పరిధిలోని సంఘాల సిబ్బందికి కూడా సచివాలయాల సిబ్బందితో కలిసి పని చేయాలని జిల్లా సహకార శాఖ అధికారులు ఇప్పటికే మౌఖిక ఆదేశాలు ఇచ్చారు.

ప్రతి సభ్యుడి ఈకేవైసీ ముఖ్యం



సహకార సంఘాల్లో సభ్యులైన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు. సచివాలయం సిబ్బంది తమ ఇంటికి వచ్చినప్పుడు గానీ, సభ్యులు సచివాలయానికి వెళ్లయినా సరే తమ అకౌంట్‌లతో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సొసైటీల సిబ్బంది సచివాలయాల సిబ్బందితో సమన్వయంగా పని చేయాలన్నారు.

– ఎం. వెంకటరమణ, జిల్లా సహకార శాఖ అధికారి

సారూ.. గత అర్జీలు ఏమయ్యాయి?

- ఇప్పటికీ పరిష్కారం కాలేదే!
- అధికారులను నిలదీసిన స్థానికులు



గణపవరం సభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఏవీ రమణ

నాదెండ్ల: గతంలో జరిగిన గ్రామ రెవెన్యూ సభల్లో అందించిన అర్జీలు పరిష్కరించలేదంటూ స్థానికులు అధికారులను నిలదీశారు. గణపవరం నాలుగు సచివాలయాల పరిధిలో శనివారం గ్రామ రెవెన్యూ సభ నిర్వహించారు. ఒకటో సచివాలయం వద్ద జరిగిన సభకు తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ ధనలక్ష్మి, సర్వేయరు వీఆర్వోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు, రైతులు మాట్లాడుతూ ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా ఉపయోగం లేదని, రెవెన్యూ అధికారులు పనిచేయటం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. మ్యూటేషన్లు రెండు, ఆన్‌లైన్ నమోదుకై రెండు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రాణ నష్టం జరిగితే కాని స్పందించరేమో!



అమీన్‌సాహెబ్‌పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా మారాయి. నరసరావుపేట వెళ్లే రహదారి నుంచి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అవతలి వరకూ రోడ్డు వెంబడి మొక్కలు నాటారు. నాటిన మొక్కలు పెరిగి విద్యుత్ తీగలను తాకుతున్నాయి. తరచూ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. హైస్కూలు సమీపంలోని బోడి వెంకటేశ్వర్లు నివాసం ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో వేసిన ట్రాన్స్‌ఫార్మర్ కావటంతో లోతట్టుగా ఉండి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులకు విన్నవించినా ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

–నాదెండ్ల

కూటమి నేతలు అభివృద్ధి–సంక్షేమాలు మరిచారు

- వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు, దాడులకు పాల్పడుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న బొల్లా

వినుకొండ(నూజెండ్ల): కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు మానుకుని అభివృద్ధి, సంక్షేమం పై దృష్టి సారించాలని మాజీఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అలవి కాని హామీలిచ్చి అమలు చేయలేక సంక్షేమం గాలికొదిలి తమపార్టీలో సామాన్య కార్యకర్తలపై అక్రమకేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. అయనబాటలోనే స్థానిక చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు కూడా నడుస్తున్నారని విమర్శించారు.

■ చేతనైతే అభివృద్ధి చేయండి.. దాడులు కాదు

వినుకొండ ఎమ్మెల్యే చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వినుకొండను చేతనైతే అభివృద్ధి చేయాలని తమపార్టీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. తమ హయాంలో ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేయడం, వ్యక్తిగతంగా తమ వ్యాపారాలపై దాడులు చేయించడం మాని వినుకొండను అభివృద్ధి చేయాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తన పి.ఎ.శివపై దాడిచేసి అక్రమ కేసులు నమోదు చేశారని, ఇటీవల కాలంలో హత్యాయత్నానికి కూడా పాల్పడ్డారన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా వినుకొండ రూరల్ మండలం పిట్టంబండ గ్రామంలో కార్యకర్తలపై దాడులు చేశారని, కొచ్చెర్ల, దొండపాడు, నడిగడ్డ గ్రామాల్లో కూడా కార్యకర్తలను బెదిరించి జన్మదిన వేడుకలు అడ్డుకున్నారన్నారు. ఇలాంటి పరిపాలన తానుఎప్పుడూ చూడలేదన్నారు.

■ కార్యకర్తలకు అండగా ఉంటా

తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని బొల్లా భరోసా ఇచ్చారు. సామాన్యులపై దాడులు చేస్తే సహించమని, ఎందాకైనా పోరాటం చేస్తామన్నారు. దమ్ముంటే తనను ఎదుర్కోవాలని సామాన్యులపై మీ ప్రతాపం చూపడం సరికాదన్నారు. వినుకొండలో వ్యాపారాలు చేసేందుకు ఒక్కరు కూడా రావటం లేదన్నారు. పోలీసు అధికారం అడ్డం పెట్టుకుని మీరు చేస్తున్న అరాచకాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్నారని, ఫొటోలకు ఫోజులివ్వడం మాని రైతును ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

30న మున్సిపల్ అత్యవసర సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో ఈ నెల 30న పురపాలక సంఘం అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. పట్టణ అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు.

ఐనవోలులో డీఎస్పీ తనిఖీ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని ఐనవోలు పోలీస్‌స్టేషన్ నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. ఎస్ఐకు పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఎస్పీ కె. శ్రీనివాసరావు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మీతో మేము కార్యక్రమం గురించి వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ప్రభాకరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శరీరం–మనస్సులను ఏకం చేసేది యోగ



యోగా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అభ్యాసకులు

నరసరావుపేట ఈస్ట్: శరీరం, మనస్సును ఏకం చేసేది యోగ అని మంగళగిరి శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం ప్రధానాచార్యులు వేంకటేశ్వరరావు గురూజీ తెలిపారు. యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో నెలరోజుల పాటు నిర్వహించిన 182వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపును సందర్భంగా వేంకటేశ్వర గురూజీ అభ్యాసకులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శిబిరంలో బోధించిన ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం ప్రతిరోజు అభ్యసించాలని సూచించారు. శిబిరానికి ప్రతిరోజు హాజరైన వారికి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో యోగా గురువు కె.వెంకటజనార్ధనరావు, కన్వీనర్ కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగశిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30వతేది నుంచి 28రోజుల పాటు ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ప్రకాష్‌నగర్ రిక్షాసెంటర్‌లోని మాగులూరి వెంగళరెడ్డి బిల్డింగ్ అక్షర స్కూల్ ఆవరణలో ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో భాగంగా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్యనమస్కారాలు, ఆహార నియమాలు బోధించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

■ బాల్యవివాహాలు అరికట్టాలి

బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ అధ్యక్షతన శనివారం కిశోరి వికాసం గురించి మండలస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, బాలికల ఆత్మరక్షణ, ఉపాధి నైపుణ్యం, లింగ వివక్షత పలు అంశాల గురించి ఈ శిక్షణలో వివరించడం జరుగుతుందన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఈ శిక్షణలోని పలు అంశాల పట్ల శ్రద్ధ తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో –1 సయ్యద్ జఫ్రుల్లా, ఎంఈవో –2 కె.పార్వతి, డీసీటీవో వై.ప్రశాంత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.చిన్నమ్మాయి, షేక్ మస్తాన్‌బీ, వెలుగు పథకం ఏపీఎం టి.రంగారెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ భూసమస్యలకు సత్వర పరిష్కారం

రొంపిచర్ల: భూసమస్యలకు సత్వర పరిష్కారం రెవెన్యూ సదస్సుల్లో లభిస్తుందని తహసీల్దార్ బండి నిర్మల అన్నారు. మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చేస్తామని ఆమె అన్నారు. ఈ గ్రామ సభకు ముగ్గురు రైతులు తమ సమస్యలపై దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు. ముగ్గురు రైతులు తమ భూములను ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయాలని దరఖాస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

■ వర్సిటీ ఖోఖో జట్టుకు వాగ్దేవి విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల ఖోఖో జట్టుకు వాగ్దేవి కళాశాల విద్యార్థి షేక్.అల్మాస్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. గుంటూరులో నిర్వహించిన ఖోఖో అంతర్ కళాశాలల టోర్నమెంట్, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలో అల్మాస్ ప్రతిభ చూపి ఎంపికైనట్లు వివరించారు. కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీల్లో అల్మాస్ ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, అధ్యాపకులు అల్మాస్‌ను అభినందించారు.

■ నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

యడ్లపాడు: విధివంచితులకు సేవ చేయడం భగవంతుని సేవతో సమానమని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట బున్నీనగర్‌లో శనివారం ఖమ్మం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. కాలనీలోని లెప్రసీ కుటుంబాలకు బియ్యం, దుస్తులు, దుప్పట్లు సంస్థ ప్రతినిధులు పంపిణీ చేశారు. తమకు సాయం అందించిన సంస్థ ప్రతినిధులకు లెప్రసీ కుటుంబాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

■ రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

నరసరావుపేట: రిలయన్స్ సంస్థల స్థాపకుడు ధీరుభాయి అంబానీ జయంతి సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శనివారం పల్నాడురోడ్డులోని రిలయన్స్ స్మార్ట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పీవీఎస్ శరత్‌బాబు, కోశాధికారి గంధ్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి, డాక్టర్ రెహమతుల్లా, రిలయన్స్ స్మార్ట్ స్టోర్ మేనేజర్ లోకేష్, రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

■ మహిళా టీంకు కే–రిడ్జిలో క్యాంప్

నరసరావుపేట ఈస్ట్: ఇండియన్ ఫ్లోర్ బాల్ మహిళా జట్టుకు కే–రిడ్జి పాఠశాలలో 4రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ బర్నబాస్ శనివారం తెలిపారు. ఈనెల 28 నుంచి 31వతేది వరకు క్యాంప్ కొనసాగుతుందని, కోచ్‌గా ఫ్రిజోజోన్ వ్యవహరిస్తారని వివరించారు.